



### ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

**కలెక్టరేట్, ఏప్రిల్ 28:** బీఎల్వోల ద్వారా ఈనెల 30న ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ ప్రారంభించి మే 7లోగా పూర్తి చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గృహాలకు కలర్ ఓటరు గైడ్ కూడా పంపిణీ చేయాలని, నిర్దేశిత ఫార్మాట్‌లో సమర్పించాలని సూచించారు.

### తనిఖీల్లో రూ1.04లక్షలు పట్టివేత

**పొందూరు:** రాపాక జంక్షన్ వద్ద ఎన్నికల అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. రాజాంకు చెందిన కె.వెంకటరావు కారులో.. రూ.1.04 లక్షలు పట్టుబడింది. వాటిని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్ తెలిపారు.

# అంతా.. తుస్..

- తొలి ఇచ్చిన హామీలకే దిక్కులేదు
- సీపీఎస్ రద్దు సంగతి మరిచిన సీఎం
- పేరుకే.. పోలీసులకు వీక్లీ ఆఫ్
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు 150 డీఏలు బకాయి
- పీఎఫ్ నిధుల చెల్లింపులోనూ జాప్యం
- వైసీపీ మేనిఫెస్టోపై ఉద్యోగ సంఘాల మండిపాటు
- ఓట్ల రూపంలో బుద్ధి చెబుతామంటూ నిర్ణయం






(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకే దిక్కులేదు. ఇప్పుడు ఇంకొన్ని హామీలు అమలు చేస్తామంటే ఎట్లా నమ్మేది' అని వైసీపీ మేనిఫెస్టోపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఎవరిని కదిలించినా.. ఏ ఉద్యోగివద్ద రాష్ట్ర ప్రభుత్వం గురించి చర్చించినా... వైసీపీ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీపీఎస్ రద్దు, పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలు కాలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏలు బకాయిలు పేరుకు పోయాయని, పీఎఫ్ నిధుల చెల్లింపులోనూ జాప్యం నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా.. ఉద్యోగ సంఘాలు సైతం ప్రభుత్వం పైనా.. రాజకీయ నాయకులపై విమర్శలు చేసేందుకు వీల్లేదు. వారి చేసేది విమర్శలు కాకున్నప్పటికీ... రాజకీయ కారణంగా వ్యాఖ్యలకు దురుద్దేశం ఆపాదించి సస్పెన్షన్ వేటు వేయిస్తారేమో అన్న కారణంతో పేర్లు ప్రస్తావించకుండా వారి సమస్యలను మాత్రం పంచుకుంటున్నారు. ఉద్యోగుల కోసం ఎంతో శ్రద్ధచూపించినట్లు చెబుతున్నట్లుగా వైసీపీ మేనిఫెస్టోలో ఉన్న అంశాలపై పెదవి విరుస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలంతా ఓట్ల రూపంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

### తొలి ఇచ్చిన హామీ 'వారం రోజుల్లో సీపీఎస్ రద్దు'...

పాదయాత్ర సమయంలో.. 2019 ఎన్నికల ప్రచారంలో.. తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని సీఎం జగన్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. మాటిచ్చే వెనక్కి తగ్గేది లేదని, ప్రధానంగా ఉద్యోగులను వేధిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగులంతా వైసీపీకి అండగా నిలిచారు. వైసీపీ పాలనకు ఐదేళ్లు గడిచిపోయింది. కానీ ఇంతవరకూ సీపీఎస్ రద్దు చేయలేకపోయారు. పైగా సీపీఎస్ కోసం ఉద్యమాలు పట్టిన ఉద్యోగులపై ఈ ప్రభుత్వ హయాంలో వేధింపులు అధికమయ్యాయి. ఇప్పుడు వైసీపీ మేనిఫెస్టో విడుదల చేశారు. అందులో సీపీఎస్ రద్దు ప్రస్తావన లేదని ఉద్యోగులు అసంతృప్తి చెందుతున్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోనివారికి.. ఈ ఎన్నికల్లో బదులివ్వాలని నిర్ణయించుకున్నామని చెబుతున్నారు.

### బిల్లుల కోసం నాలుగేళ్లు నరకయాతన

వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు సమస్యలు తీవ్రమయ్యాయి. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకునేందుకు ఏళ్లతరబడి నిరీక్షించేలా చేశారు. ఏపీజీఎల్ఐ వంటి క్లయిమ్‌ల కోసం నిరీక్షలు తప్పలేదు. ఎర్నల్ లీవ్ (సంపాదిత సెలవులు)లను నగదు రూపంలో ఉద్యోగులకు మార్చుకునేందుకు మూడేళ్లు పట్టింది. సకాలంలో చెల్లింపులు లేవు. గత ప్రభుత్వంలో ఈ సమస్యలు లేవు. ఎన్నికల ముంగిట.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో మాత్రమే కొంతమందికి డబ్బులు చెల్లించారు. ఉపాధ్యాయులకు జీవో 117 ఇబ్బందికరంగా ఉంది. దీనిద్వారా భారాన్ని తగ్గిస్తామని మేనిఫెస్టోలో పెట్టలేదు. అన్నింటికంటే మించి ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లింపు.. ఈ విషయాన్ని ప్రభుత్వమే మరిచిపోయింది. ఏకంగా 150 డీఏలు బకాయి ఉన్నాయి. గత ప్రభుత్వంలో మెరుగైన పీఆర్సీ ఉండేది. ఇప్పుడు పీఆర్సీ గురించే చర్చలేదు. బకాయిలు చెల్లిస్తామన్న హామీకూడాలేదు. ఉద్యోగ సంక్షేమం అంతా తూచ్ అని మండిపడుతున్నారు. తమను ఇంతలా ఇబ్బందిపెట్టి.. ఇప్పుడు మేనిఫెస్టోలో ఆశ చూపినంత మాత్రాన నిర్ణయం మారిపోదని.. సైలెంట్‌గా మా బదులు కూడా ఉంటుందని కొంతమంది ఉద్యోగులు వెల్లడించారు.

## పోలీసులకు వీక్లీఆఫ్ మున్నాళ్ల ముచ్చటే



(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ఇచ్ఛాపురం)

పోలీసులు సెలవులు లేకుండా విధులు నిర్వహించేవారు. పోలీసులకు కూడా ఇతర ప్రభుత్వ శాఖల మాదిరి వీక్లీఆఫ్ అమలు చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాస్థాయి అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకూ వీక్లీ ఆఫ్‌లు ఇస్తామని చెప్పడంతో అంతా సంతోషించారు. కాగా.. కొన్ని నెలలు వీక్లీఆఫ్‌లు అమలుచేసి.. తర్వాత ఎత్తేసింది. దీంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. జిల్లాలో 1,520మందికిపైగా పోలీస్ శాఖలో పనిచేస్తున్నారు. వీరితో పాటు ఏఆర్ కానిస్టేబుల్స్ 370 మందికి పైగా విధుల్లో ఉన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు అధికారిక సెలవులు, వారాంతపు సెలవులు, పండగల సెలవులు ఉన్నా.. పోలీస్ శాఖలో మాత్రం వాటిని పొందే అవకాశం ఉండదు. నిత్యం పని ఒత్తిడితో మునిగి తేలే తమకు కూడా వారాంతపు సెలవులు ఇవ్వాలంటూ పోలీస్ శాఖలో చాలా కాలంగా డిమాండ్ ఉంది. 2019 ఎన్నికల సమయంలో నాడు ప్రతిపక్ష నేతగా జగన్.. తాము అధికారంలోకి వస్తే పోలీసులకు వారాంతపు సెలవు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోలీసులు సైతం గత ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వీక్లీ ఆఫ్‌లు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పది నెలలు అమలు చేసి.. మళ్లీ ఎత్తేశారు. దీంతో పోలీసులంతా మరింత ఒత్తిడితో విధులు నిర్వహిస్తూ.. అనారోగ్యంగా ఇబ్బందులు పడుతున్నారు. వీక్లీ ఆఫ్ ప్రకటనల్లోనే తప్ప.. ఆచరణకు నోచుకోవడం లేదని.. ఇబ్బందులను బయటకు చెప్పుకోలేని పరిస్థితి తమదంటూ పోలీసులు ఆవేదన చెందుతున్నారు.



గజమాలతో ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్‌కు స్వాగతం పలికిన వరం కుటుంబ సభ్యులు

## వైసీపీకి భారీ షాక్

- టీడీపీలోకి వరం కుటుంబ సభ్యులు
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల సమక్షంలో చేరిక

**అరసవల్లి, ఏప్రిల్ 28:** శ్రీకాకుళం మునిసిపల్ మాజీ చైర్మన్.. దివంగత నేత అంధవరపు వరాహనరసింహం (వరం) కుటుంబ సభ్యులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆదివారం గుజరాతీపేటలో భారీ ర్యాలీగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌కు వరం కుమార్తె, మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కుమారులు ప్రసాద్, సంతోష్ తదితరులు 500 కుటుంబాలతో స్వాగతం పలికి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో శ్రీకాకుళం పట్టణంలో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లయింది. వీరికి ఎంపీ రామ్మోహన్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇంత భారీ సంఖ్యలో పార్టీలో చేరడం ఆనందంగా ఉందని, గతంలో స్వర్గీయ ఎర్రన్నాయుడు.. వరంగారితో కలిసి పనిచేశారన్నారు. గుజరాతీపేట టీడీపీకి కంచుకోటగా ఉండేదని, మళ్లీ ఇప్పుడు అదే స్థితికి రావడం సంతోషమన్నారు. పార్టీలో కష్టించి పనిచేసే వారికి తప్పనిసరిగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ చేరికతో గుజరాతీపేటలో వైసీపీ కనుమరుగైపోయిందన్నారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత నేత వరం ఆశయాలను కొనసాగించేందుకు గుజరాతీపేట ప్రజల మద్దతుతో టీడీపీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బోయిన గోవిందరాజులు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు పీవీ రమణ, కొర్ను నాగార్జున ప్రతాప్, పైడిశెట్టి బెనర్జీ, జామి భీమశంకర్, కరగాన భాస్కరరావు పాల్గొన్నారు.

## సీఎం బటన్ నొక్కినా.. అందని విద్యాదీవెన



- ఊసేలేని వసతి దీవెన
- ఫీజులు చెల్లించాలని కళాశాలల ఒత్తిడి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థుల గగ్గోలు

(గుజరాతీపేట)

విద్యాదీవెన, వసతి దీవెన నిధుల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లమా తదితర కోర్సులకు సంబంధించి ఏడాది ఫీజును రీయింబర్స్‌మెంట్‌లో భాగంగా నాలుగు విడతలుగా 'విద్యా దీవెన' పథకం కింద విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా 2023-24 విద్యాసంవత్సరం పూర్తయినా.. ప్రభుత్వం నుంచి విద్యాదీవెన ఒక్క టెర్మ్ కూడా చేతికందలేదు. మార్చి ఒకటో తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి మొదటి విడత కింద విద్యాదీవెనకు సంబంధించి బటన్ నొక్కారు. కానీ ఇంతవరకూ విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నిధులు జమకాలేదు. దీంతో ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 48,431 మంది విద్యార్థులను విద్యాదీవెన పథకానికి అర్హులుగా గుర్తించారు. మార్చిలో సీఎం బటన్ నొక్కినప్పుడు కేవలం ఐదుశాతం మందికే డబ్బులు జమ య్యాయి. మిగిలిన వారంతా నిధుల కోసం ఎదురుచూస్తు న్నారు. సెమిస్టర్ ఫీజు చెల్లించాలని కళాశాలల యాజమా న్యాలు ఒత్తిడి చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వసతి దీవెన ఊసేలేదు. వసతి దీవెనకు సంబంధించి డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, డిప్లమా విద్యార్థులకు రూ.7,500 చొప్పున ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది. ఇప్పటివరకు నిధులు జమకాకపోవడంతో.. డేస్కాలర్, హాస్టల్ విద్యార్థులు.. యాజమాన్యా లకు డబ్బులు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి విద్యాదీవెన, వసతిదీవెన నిధులు తమ ఖాతాల్లో జమ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

### పేదలకు మరింత భారం..



ఫీజు రీయింబర్స్‌మెంటు రాకపోవడంతో తల్లిదండ్రులపై మరింత భారం పడుతోంది. ప్రభుత్వమే న్యాయం చేయాలి. పేదలు ఒక్కసారి డబ్బులు కట్టాలంటే కష్టమే.

-బి.నిఖిల్, బీఎస్సీ విద్యార్థి

### ప్రభుత్వమే బాధ్యత వహించాలి..



ఫీజు మొత్తం ఒక్కసారి కట్టలేక విద్యార్థులంతా ఆందోళనకు గురవుతున్నారు. హాస్టల్ ఫీజు తో పాటు రీయింబర్స్‌మెంటు చెల్లించాలంటే తలకు మించిన భారమవుతోంది. ఫీజు విషయంలో ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

-శిమ్మ గణేష్, శ్రీకాకుళం

### పాత పద్ధతే మేలు..



టీడీపీ హయాంలో అమలు చేసేలా.. కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతి మేలు. కళాశాలలు, ప్రభుత్వం మధ్య లావాదేవీ వ్యవహారాలు చూసుకునేవారు. ఇప్పుడు జాయింట్ అకౌంట్‌లో ఎప్పుడు డబ్బులు పడతాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నాం.

-చల్లా హేమసుందర్, డిప్లమా విద్యార్థి



కూలిన బాహుదా నది వంతెన(ఫైల్)

## బాహుదా.. ఇక అంతేనా?

- బ్రిడ్జి కూలి ఏడాదైనా.. ప్రారంభం కాని పనులు
- శంకుస్థాపనకే పరిమితం
- నేటికీ కానరాని టెండర్ల ప్రక్రియ
- అధికార పార్టీ నేతల ప్రకటనలు ఉత్తుత్తివే

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 28:** ఇచ్ఛాపురంలో 97ఏళ్ల చరిత్ర కల్గిన బాహుదా నది వంతెన గతేడాది కూలి సగభాగం నేలకొరిగింది. నెలల వ్యవధిలో ఆ వంతెనకు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకొచ్చారు. నూతన వంతెన నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరు కాగా.. మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. కానీ, ఇంతవరకూ పనులు ప్రారంభం కాలేదు. కేవలం ఎన్నికల స్టంట్‌లో భాగంగానే శంకుస్థాపన చేసి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాహుదా నదిపై 1927ఫిబ్రవరిలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం వంతెన నిర్మించింది. వంతెన కాలపరిమితి 50ఏళ్లు మాత్రమే. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోజురోజుకీ వంతెన క్షీణించింది. 20 టన్నుల లోడుకు మించి ఈ వంతెనపై ప్రయాణం చేయకూడదు. కానీ గతేడాది మే 3న వేకువజామున పరిమితికి మించి 80 టన్నుల భారీ గ్రానైట్ లోడు ఓ ట్రాలర్ ఒడిశా నుంచి బెంగళూరుకు ఈ వంతెనపై ప్రయాణించింది. దీంతో ఒక్కసారిగా వంతెన కుప్పకూలిపోయింది. వంతెన శిథిలాలుతో పాటు ట్రాలర్ కూడా కిందకి కూరుకుపోయింది. అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ స్పందించి.. తాత్కాలిక వంతెన నిర్మాణం కోసం రూ.40లక్షల నిధులు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు యుద్ధప్రాతిపదిక తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. కానీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసింది. కానీ, ఇంతవరకూ టెండర్ల ప్రక్రియ చేపట్టక పనుల ఊసేలేదు. త్వరలోనే నూతన వంతెన నిర్మిస్తామన్న అధికారపార్టీ నేతల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ఎన్నికల వేళ.. ఇటీవల శంకుస్థాపన చేసి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి వంతెన రోడ్డు నిర్మాణమైనా పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

## ఎంతపనిచేశావు జగన్

- నిధుల మంజూరు రద్దుతో నిలిచిన రోడ్డు పనులు
- అధ్వానంగా అంపురం-ఘాటి ముకుందపురం రోడ్డు
- అవస్థలు పడుతున్న 30 గ్రామాల ప్రజలు
- పట్టించుకోని వైసీపీ నాయకులు

**కంచిలి, ఏప్రిల్ 28 :** వైసీపీ పాలకుల పుణ్యమాని తాము ఇటు కంచిలి వైపు రాలేక పోతున్నామని, ఒడిశా వైపు కూడా రాకపోకలు సాగించలేకపోతున్నామని 30 గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ప్రభుత్వం అంపురం-ఘాటి ముకుందపురం రోడ్డుకు సంబంధించిన నిధులు మంజూరును రద్దు చేసింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో ఎంత పనిచేశావు జగన్ అని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. కంచిలి మండలం అంపురం నుంచి ఘాటి ముకుందపురం వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.15కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో స్థానికులతోపాటు ఆ రహదారి గుండా నిత్యం ప్రయాణించే ఎనిమిది పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించనున్న తరుణంలో 2019లో ఎన్నికలు వచ్చాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా నిత్యం ఇటు కంచిలి, సోంపేట, అటు ఒడిశా వైపు రాకపోకలు సాగించే కర్తలి, ఎంఎస్‌పల్లి, బైరిపురం, ముండల, డీజీపురం, రేఖాదేవిపురం, పోలేరు తదితర గ్రామాల ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. వైసీపీ నాయకులు ఈ రోడ్డు పనులపై కనీసం పట్టించుకోలేదని మండిప డుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో అధికారులు నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈఈ మోహనరావు వద్ద ప్రస్తావించగా.. రహదారి పనులకు సంబంధించి రూ.20కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



అంపురం సమీపంలో గోతులమయంగా మారిన రహదారి



సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

### పలాసలో సభ రద్దు

**పలాస:** పలాసలో ఆదివారం సాయంత్రం కాశీబుగ్గ బస్టాండు వద్ద నిర్వహించాల్సిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సభ అర్థాంతరంగా రద్దయింది. టెక్కలిలో సభ పూర్తయిన వెంటనే ఆమె పలాస చేరుకున్నారు. కాగా.. కాకినాడలోని అత్యవసర సమావేశంలో పాల్గొనాల్సి ఉండడంతో ఆమె వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో షర్మిల సభ రద్దయిందని పలాస కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు ప్రకటించారు.

## వైసీపీ పాలనలో అన్నింటా మోసం

- కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**టెక్కలి, ఏప్రిల్ 28:** 'వైసీపీ పాలనలో అంతా మోసమే. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం. ప్రజల పక్షాన పోరాడుతున్నాం. ఒక్కసారి ఆలోచించండి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి.. గెలిపించండి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. ఏపీ న్యాయయాత్రలో భాగంగా ఆదివారం టెక్కలిలోని ఇందిరా గాంధీ కూడలిలో నిర్వహించిన ప్రచారసభలో ఆమె మాట్లాడారు. 'శ్రీకాకుళం పరిధిలో వంశధార ప్రాజెక్టు పూర్తిచేస్తానని జగన్ మాట ఇచ్చి విస్మరించారు. టెక్కలి, పలాస నియోజక వర్గాల పరిధిలోని ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్‌ను.. రాజశేఖరరెడ్డి కొడుకుగా పూర్తిచేస్తానని చెప్పారు. కానీ ఇంతవరకూ పనుల పూర్తికాలేదు. సీఎం జగన్ ఇన్నాళ్లూ ప్రజల వద్దకు రాలేదు. కనీసం తోటి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులకు ప్రభుత్వం.. సొమ్ములు జమచేయలేదు. దీంతో వారి సర్టిఫికెట్లు విద్యాసంస్థలు అంటిపెట్టుకున్నాయి. 2.30లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి.. కాలయాపన చేశారు. ఎన్నికల ముందు.. ఆరువేల ఉద్యోగాలతో దగా డీఎస్సీ ప్రకటించి.. నిరుద్యోగులను మోసం చేశారు. మద్యపాన నిషేధమంటూ మేనిఫెస్టోను ప్రకటించి.. భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో సమానమని చెప్పి.. ప్రభుత్వమే మద్యం విక్రయించి సొంత బ్రాండ్లతో ప్రజల ప్రాణాలు తీస్తోంది. ఎన్నికల వేళ సిద్ధమంటూ ప్రజల ముందుకు వచ్చి.. మరోసారి మోసగించేందుకు వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు' అని షర్మిల ఆరోపించారు. 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు.. ఉద్యోగాలు వస్తాయి. అభివృద్ధి జరుగుతుంది. యువత భవిష్యత్ కోసం.. ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మాటిచ్చారు. దానిని పొందేందుకు కాంగ్రెస్‌కు అండగా నిలవాల'ని షర్మిల కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి కిల్లి కృపారాణి, ఇండియా కూటమి అభ్యర్థులు గోవిందరావు, షణ్ముఖరావు, టీబీజీ గుప్త, పొట్నూరు ఆనందరావు, చింతాడ దిలీప్ పాల్గొన్నారు.



టెక్కలిలో సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు



సగంలో నిలిచిపోయిన వనితమండలం-గార వంతెన పనులు

- వనితమండలం-గార బ్రిడ్జిపై సర్కారు నిర్లక్ష్యం
- ఐదేళ్లయినా పూర్తి చేయలేకపోయిన వైనం
- టీడీపీ హయాంలోనే సగం పనులు పూర్తి
- మిగతా వాటిని పూర్తి చేయడంలో వైసీపీ విఫలం
- నిధుల్లేవంటున్న ఎమ్మెల్యే కృష్ణదాస్
- రెండు మండలాల ప్రజలకు తప్పని ఇబ్బందులు

# వంతెన వంచన

**పోలాకి-గార మండలాల ప్రజలకు ఎంతో కీలకమైన వనితమండలం వంతెన పనులపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తవుతున్నా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో విఫలమైంది. టీడీపీ హయాంలోనే యాభై శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా వాటిని పూర్తి చేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. ఫలితంగా రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు తమను నయవంచనకు గురి చేసిందని మండిపడుతున్నారు. కేవలం రాజకీయ కక్షతోనే పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు.**

(పోలాకి)

పోలాకి మండలంలోని వనితమండలం, గార, కళింగపట్నం గ్రామాలను కలుపుతూ వంశధార నదిపై వంతెన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. వంతెన కోసం రూ.72 కోట్లను అప్పటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంజూరు చేయించారు. 2017లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టారు. 50 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, 2019లో శాసనసభ ఎన్నికల కోడ్ అమలు చేయడంతో పనులకు ఆటంకం కలిగింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వనితమండలం- గార వంతెన పనులపై దృష్టి సారించలేదు. రాజకీయ కక్షతో పనులు మందకొడిగా చేశారు. దీంతో పోలాకి, గార మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ఎందుకు నిలిపివేశారని పాలకులను ప్రశ్నిస్తున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే పనులు ముందుకు సాగవని ఆందోళన చెందుతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే పనులు చకచకసాగుతాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం స్థాయిలో వంతెన పనులను ధర్మాన కృష్ణదాస్ కొనసాగించలేక పోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వంతెనను ప్రారంభించలేక పోయారని స్థానికులు మండిపడుతున్నారు. కేవలం రాజకీయ కక్షతోనే పనులు చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే పోలాకి మండలంలోని మత్స్యకారులు చేపల వేట కోసం వనిత మండలం మీదుగా గార మండలంలోని కళింగపట్నం, జిల్లా కేంద్రం శ్రీకాకుళానికి రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది. 10 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. అలాగే, శ్రీకాకుళం, సింగుపురం, గార, కళింగపట్నం, శ్రీకూర్మం, అరసవల్లి, శ్రీముఖలింగం, రావివలస, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణం సులభతరం కావడంతో పాటు తక్కువ ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కానీ ఆ కల వైసీపీ పాలనలో నెరవేరలేదని ఆవేదన చెందుతున్నారు. వంతెన పనులు చకచక సాగిద్దామని ఎందరో వైసీపీ నాయకులు, సీనియర్ ఇంజనీర్లు, రాజకీయ పెద్దలు పరిశీలించి హడావుడి చేశారే తప్పా నిర్మాణం మాత్రం చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన కోసం అప్పటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జీడి రైతులను ఒప్పించి 5 కిలో మీటర్ల పొడవు, 80 అడుగుల వెడల్పుతో జీడి తోటల్లో రహదారిని నిర్మించారు. వంతెన నిర్మాణానికి అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలు భద్రపరుచు కునేందుకు రేకు షెడ్లను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆరు బయట ఇనుప సామగ్రి నిల్వ ఉంచడంతో అవి తుప్పుపడు తున్నాయి. కొన్ని దొంగల పాలవుతున్నాయి. ఇప్పటికైనా వంతెనను పూర్తి చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతు న్నారు. దీనిపై అధికార పార్టీ ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను ప్రశ్నిస్తే.. నిధుల కొరత కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నాయని చెప్పడం కొసమెరుపు.



ఆరుబయట ఉన్న వంతెన సామగ్రి

### రాజకీయ పట్టింపులు విడనాడాలి..



వనిత మండలం- గార మండలం మధ్య వంశధార నదిపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో రాజకీయ పట్టింపులు విడనాడాలి. టీడీపీ హయాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వంతెన నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారు. రైతులను ఒప్పించి భూములను వితరణగా అందజేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పనులను నిర్లక్ష్యం చేసింది. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలి. వంతెన ప్రారంభిస్తే మాకు ఎంతో ఉపయోగపడుతుంది. **-కుమ్మరి లక్ష్మణ, వనితమండలం, పోలాకి మండలం**

### వంతెనను ప్రారంభించాలి..



వంతెన పనులు పూర్తి చేయించి ప్రారంభించాలి. ఈ వంతెన కోసం ఎంతో మంది రైతులు భూములను విరాళంగా ఇచ్చారు. అధికారులు స్పందించి పనులు చేపట్టాలి. రానున్న ఎన్నికల్లో అలసత్వం ప్రదర్శించిన నాయకులకు ఓటు ద్వారా బుద్ధి చెబుతాం. **-లంకాపు సూర్యనారాయణ, వనితమండలం బీసీకాలనీ, పోలాకిమండలం**

**పీపుల్స్ మేనిఫెస్టో**



## అభివృద్ధిని కాంక్షించిన వారినే ఎన్నుకోవాలి

**జి.సిగడాం:** ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడు సంక్షేమం కోరే వాడై ఉండాలి. రోడ్లు, తాగునీరు, విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజల్లో ఒకడై ఉండి వారి కష్టాల్లో పాలుపంచుకోవాలి. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా నాయకుడిని ఎన్నుకోవాలి. గెలిచిన తర్వాత ప్రజలను పక్కన పెట్టకుండా ఆపదలో ఆదుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రం నిరుద్యోగ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేవాడే అసలైన ప్రజా ప్రతినిధి. అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడినే ఎన్నుకోవాలి.

**-మక్క దివాకర్, పెంట, జి.సిగడాం మండలం**

**పెద్దల మాట**



## పెద్దలు చెప్పిన వారికే ఓటు వేసేవాళ్లం

**నరసన్నపేట:** ఓట్ల ఎలచ్చన్ తొలిరోజుల నుంచి ఓటు వేయడం నాకు ఎరుక. అప్పట్లో ఓట్లు అంటే ఊళ్లో అంతా కలిసిమెలిసి ఉండే వాళ్లు. వాళ్లు ఎవరికి చెబితే వాళ్లకే ఓట్లు వేసేవాళ్లం. ఈరోజుల్లో ఉండే విధంగా అప్పట్లో గొళ్లు గొడవలు ఉండేవి కావు. పొక్క చిక్కుడు మాట్లల్లేవ్. డబ్బులు ఇవ్వడం ఎరగం. నిజాయితీగా ఇంట్లో పెద్దలు చెప్పిన విధంగా ఓట్లు వేసేవాళ్లం. మా ఊరు నుంచి వెళ్లి ముమ్మారు నరసన్నపేటలో ఓటు వేశాం. ఇనమారు పోలాకి వెళ్లి ఓట్లు వేశాం. ఓట్లు వేయడానికి మూడు నుంచి ఏడు కిలోమీటర్లు వరకు నడిచే వెళ్లేవాళ్లం. పెద్దలు చెప్పిన వారికి ఓటు వేయడానికి అంత కష్టపడే వాళ్లం. ఇప్పుడు రోజులు మారాయి. ఎలచ్చన్ వచ్చిందంటే గొడవలు.. గొళ్లు చూస్తున్నాను.

**-వెలమల నీలమ్మ (102), జమ్మూ గ్రామం, నరసన్నపేట మండలం**





# జన కేతనం



అర్ధాంతరంగా నిలిచిపోయిన మర్రిపాడు హెల్త్ క్లినిక్ భవనం

# విలేజీ హెల్త్ క్లినిక్‌లు

- అర్ధాంతరంగా ఆగిన పనులు
- అద్దె భవనాలే దిక్కు
- మొక్కుబడిగా వైద్య సేవలు
- ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్న గ్రామీణ ప్రజలు

(మెళియాపుట్టి)


ఇంటి ముంగిటికే వైద్య సేవలు తీసుకువస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అటకెక్కాయి. నిధులు లేక, నిర్వహణకు నోచుకక పూర్తిస్థాయిలో సేవలందని పరిస్థితి నెలకొంది. ఇరుగ్గా ఉండే అద్దెభవనాల్లో అరకొర సేవల అందిస్తుండడంతో అటువైపు గ్రామీణ ప్రాంత ప్రజలు కన్నెత్తి చూడడం లేదు. సొంత భవనాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినా నిధులు లేక, పర్యవేక్షణకు నోచుకోక పోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిపుణులైన వైద్యులు గ్రామానికి వచ్చి ప్రజల నాడిపట్టి, రోగాన్ని గుర్తించి, మందులిస్తారని వైసీపీ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పారు. వాటిని నమ్మిన పేద ప్రజలకు నిరాశే మిగిలింది. ఆరోగ్య సురక్ష శిబిరాలు పేరుతో రెండేళ్లుగా మొక్కుబడిగా సేవలందించి చేతులు దులుపుకొన్నారు. వైసీపీ ప్రభుత్వం దీన్ని ఓ ప్రచార ఆయుధంగా వినియోగించుకుంది. నిపుణులు లేకుండానే ఆరోగ్యకేంద్రంలో ఉన్న ఎంబీబీఎస్ వైద్యులతో 104 వాహనాలతో వైద్యసేవలు అందిస్తూ మమ అనిపించేవారు.

### ఇదీ జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 68 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 548 హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయి. ఇందులో 85 క్లినిక్‌లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 132 మంది వైద్యులు అవసరంకాగా ఇంకా 20 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తే గ్రామీణులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో వైసీపీ నాయకులు హడావుడి చేశారు. చిన్నపాటి పరీక్షలు చేసినా లక్షల మందికి చికిత్స చేసినట్లు ప్రచారం చేసేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీకి ఒకరు చొప్పున ఆరోగ్యమిత్రలు ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ కార్యక్రమాలు నిర్వహించే వారు. అయితే వారిని తొలగించడంతో పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలందని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. హెల్త్‌క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వం వైద్యసేవలు అందక పోవడంతో గ్రామీణులను ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.



ఇలాయిపురం హెల్త్ క్లినిక్‌లో వైద్యసేవలు అందిస్తున్న ఆశవర్కర్




## ఎన్నికల గుర్తులు ఎలా వచ్చాయంటే..

(నరసన్నపేట)

భారతదేశంలో 1952లో జరిగిన తొలి ఎన్నికల సమయానికి అక్షరాస్యత 16 శాతమే ఉండేది. దీంతో ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గుర్తించడం కష్టతరం కాబట్టి సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రంలో గుర్తులను ఉంచాలని నిర్ణయించారు. ఇందుకుగాను 1950లో ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేథితో పెన్సిల్‌తో చిత్రాలను గీయించి... వాటిలో గుర్తులను ఎన్నికల బ్యాలెట్ పత్రంలో ఉపయోగించుకున్నారు. అలా వివిధ రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. ఎంఎస్ సేథి 2000వ సంవత్సరంలో కన్ను మూశారు. ఇదిలా ఉండగా కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేది. వివిధ రాజకీయ పార్టీల తరుపున బీ-ఫారం సమర్పించి... పోటీ చేసే వారికి ఆ పార్టీ గుర్తులను కేటాయించారు. ఈవీఎంలు వచ్చాక గుర్తులతో పాటు అభ్యర్థి పేరు, ఫొటోతో పాటు కేటాయించిన గుర్తును అందుబాటులో ఉంచారు.

# ఉచితమన్నారు కదా జగనన్నా..

- ఇప్పుడేంటి విద్యుత్ బిల్లులు కట్టమంటున్నారు..
- పలాస ఎస్సీకాలనీ వాసుల ఆందోళన
- పలువురికి నోటీసులు అందించిన అధికారులు
- 200 యూనిట్ల లోపు వినియోగించిన వారికి కూడా..
- బకాయిలు చెల్లించాలని ఒత్తిడి
- లేదంటే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరింపు

**ఎస్సీలకు 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఉచితం. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎస్సీల సంక్షేమమే తమ ధ్యేయమంటూ సీఎం జగన్ ఎన్నో సందర్భాల్లో చెప్పారు. కానీ, చాలాచోట్ల అది అమలు కావడం లేదు. పలాస మండలంలోని ఎస్సీ కాలనీయే దీనికి ఉదాహరణ. విద్యుత్ ఉచితమని చెప్పడంతో ఇక్కడి ప్రజలు రెండేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పుడు సడన్‌గా అధికారులు వచ్చి మీరు రూ.వేలల్లో బకాయిలు ఉన్నారని, తక్షణమే చెల్లించాలని నోటీసులు అందిస్తుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తోన్నారు. అదేంటి.. జగనన్నా ఉచితమన్నారు కదా అంటే.. ఆ విషయం తమకు తెలియదు పైఅధికారులతో మాట్లాడుకోండి అని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. ఈ ప్రాంతంలో టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండడంతోనే విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తోన్నారనే ప్రచారం జరుగుతోంది.**



విద్యుత్ కనెక్షన్ కట్ చేయడానికి వచ్చిన అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ఎస్సీ కాలనీ ప్రజలు


**పలాస, ఏప్రిల్ 28:** పలాస ఎస్సీ కాలనీకి చెందిన గృహ యజమానులకు విద్యుత్‌శాఖ భారీగా షాకిచ్చింది. ఒక్కో ఇంటికి రూ.1500 నుంచి రూ.10 వేల వరకూ బిల్లులు బకాయిలు ఉన్నాయని, తక్షణం వాటిని చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం కాలనీకి వెళ్లడంతో సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. పలాస ఎస్సీ వీధుల్లో మొత్తం 200కు పైగా గృహాలు ఉన్నాయి. 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ అని ప్రకటించగానే వారు రెండేళ్ల నుంచి ఆ విధంగా విద్యుత్‌ను వినియోగిస్తూ బిల్లులు చెల్లించడం లేదు. అయితే నిబంధనల ప్రకారం ఉచితమే అయినా మిగిలిన యూనిట్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ లబ్ధిదారులు మాత్రం బిల్లులు చెల్లించక ఇంతకాలం మౌనం వహించారు. దీనిపై విద్యుత్ అధికారులు కూడా వారికి ఎటువంటి నోటీసులు గానీ, హెచ్చరికలు గానీ చేయకపోవడంతో కాలం గడిచిపోయింది. ప్రస్తుతం రెండు రోజుల నుంచి అధికారులు డి-లిస్టుల ప్రకారం విద్యుత్ కనెక్షన్లు తొలగించడానికి సిద్ధమయ్యారు. ఎస్సీ కాలనీల్లో అనేక మంది వినియోగదారుల బిల్లులు అపరాధ రుసుంతో సహా రావడంతో వారంతా ఖంగుతిన్నారు. రూ.వేలు బిల్లులు రావడంతో వారు ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. విద్యుత్ సిబ్బందిని ప్రశ్నిస్తే తమ పైఅధికారులకు అడిగి తెలుసుకోండని సమాధానం ఇస్తున్నారు. ఇదిలా ఉండగా మరికొంతమందికి 200 యూనిట్లకు తక్కువగా విద్యుత్ వినియోగించినా రూ.1600 మేరకు అపరాధ రుసుంతో కట్టాలని ఆదేశించడంతో వారు బతుకుజీవుడా అంటూ కడుతున్నారు. పెద్ద మొత్తంలో వచ్చిన వారు మాత్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల భారం ఎన్నికల సమయంలో ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కక్షసాధింపు చర్యలని కొంతమంది వాదన వినిపిస్తుండగా, మరికొంతమంది అదనంగా వినియోగించాం కనుకే బిల్లులు వచ్చాయని, అయితే విద్యుత్ శాఖ అధికారులే దీనికి బాధ్యత వహించాలని అంటున్నారు.

రెండేళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోతుంటే ఆ శాఖ అధికారులు ఎందుకు మౌనం దాల్చారని ప్రశ్నిస్తున్నారు. సామాన్యులు ఒక నెల విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే మారు నెల డి-లిస్టులో పెట్టి విద్యుత్ వైర్లు కటింగ్ చేసే అధికారులు పలాస ఎస్సీకాలనీలో వందల సంఖ్యలో ఇళ్లకు బిల్లులు చెల్లించకపోతే ఎందుకు పట్టించుకోలేదోనన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రాంతంలో టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండడంతో ఉద్దేశపూర్వకంగా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై డీఈఈ జిప్రసాద్‌ను వివరణ కోరగా.. రాజకీయ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. 'ఏ కారణంగా విద్యుత్ తొలగిస్తున్నారో తెలుసుకోవడానికి ప్రజలు సంబంధిత సచివాలయాలకు వెళ్లాలి. ఆ మేరకు విద్యుత్ బకాయిలు చెల్లించాలి. కూడదంటే దీనిపై అప్పీలు కోరవచ్చని' సూచించారు.



విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్న ఎస్సీకాలనీ ఇదే..

### రెండేళ్లుగా అధికారులు ఏమి చేస్తున్నారు..



రెండేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదని చెప్పి ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్లు తొలగించడం తప్పు. నేను 200 యూనిట్ల కన్నా తక్కువ వినియోగిస్తున్నా నాకు నోటీసు ఇచ్చి మరీ డబ్బులు కట్టించుకున్నారు. ఈ ప్రాంతంలో అంతా దినసరికూలీలే. అధికారుల తప్పులకు అమాయకులమైన మాలాంటి వారు బలవుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించాలి.

**-అప్పలస్వామి, విద్యుత్ వినియోగదారుడు, ఎస్సీ వీధి**



నిర్మాణ దశలో ఆగిపోయిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్

- తాగు, సాగునీటికి తప్పని వెతలు
- కలగా జీడి పరిశోధన కేంద్రం
- వంతెనలూ నిర్మించలేదు
- పాలకుల హామీలన్నీ గాలికొదిలేశారు
- ఇదీ పలాస నియోజకవర్గంలో పరిస్థితి

# ఒక్క సమస్యా పరిష్కారం కాలే!



ఉద్దానం జీడిపిక్కలు

(పలాస)

రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా పలాస నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఇందులో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలను చేర్చారు. ప్రస్తుతం పలాసలో నాలుగో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. అంతకుముందు సోంపేట, టెక్కలి నియోజకవర్గాల్లో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పలాస మండలం ఉండేది.

> వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా పలాస నియోజకవర్గంలో ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోలేదు. హామీలన్నీ గాలికొదిలేశారు. అవే సమస్యలు.. అవే వెతలు పలాస ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా జంటపట్టణాల్లో తీవ్ర తాగునీటి సమస్య వేధిస్తోంది. సాగునీరు కూడా రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. రోడ్డు కం బ్రిడ్జిల ఊసేలేదు. జీడి పరిశోధన కేంద్రాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదీ పలాస నియోజకవర్గంలో పరిస్థితి.

## వేధిస్తోన్న తాగునీటి సమస్య

లక్ష మంది జనాభా ఉన్న పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఏటా వేసవిలో నీటి కోసం అవస్థలు తప్పడం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత మంచినీటి పరిష్కారానికి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీలు నీటిని వినియోగించడానికి రూ.100కోట్లు మంజూరు చేసింది. అయితే ఆ రిజర్వాయర్ పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు పూర్తికాలేదు. కేవలం కాలువ తవ్వారు. భూసేకరణ కూడా పూర్తికాలేదు.



హరిసాగరం చెరువు

దీంతో జంటపట్టణాల తాగునీటి అవసరాలకు కేటాయించిన నిధులు మురిగిపోయాయి. యథాతథంగా తాగునీటి కష్టాలు తప్పడంలేదు. రూ.700 కోట్లతో నిర్మించిన సమగ్ర మంచినీటి పథకం ద్వారా మునిసిపాలిటీ పరిధిలో ప్రాంతాలకు నీరందడం లేదు. వందలాది గ్రామాలకు నీరందించే ఉద్దాన మంచినీటి పథకం మరమ్మతులకు ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో ఆ పథకం మూతపడే దశకు చేరుకుంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు అరకొరగా నీరు వస్తుండగా, మరికొన్ని ప్రాంతాలకు చుక్క నీరు కూడా రావడం లేదు.

## జీడి పరిశోధన కేంద్రం అంతేనా!

నియోజకవర్గంలో 20 వేలకు పైగా జీడికార్మికులు, 20 వేలు జీడి రైతులు ఉన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఒక్క జీడి ఆధారిత పరిశ్రమను సైతం ఏర్పాటుకు నోచుకోలేదు. జీడి రైతుల కోసం ప్రత్యేక ప్యాకేజీతోపాటు జీడి పరిశోధన కేంద్రం కోసం ప్రభుత్వం హామీఇచ్చినా ఇంతవరకూ నెరవేరలేదు. జీడి పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయలేదు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించలేదు. తమ జీవితాలకు ప్రభుత్వం కనీసం భరోసా ఇవ్వలేకపోయిందని జీడికార్మికులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి గిట్టుబాటు ధర కోసం న్యాయపోరాటం చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. జీడిపరిశోధన కేంద్రం ఏర్పాటు కలగా మారింది.

## వదలని సాగునీటికి కష్టాలు

దశాబ్దాల కిందట పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో నిర్మించిన వంశధార ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోయింది. దీంతో ఖరీఫ్ ఆరంభం నుంచి సైతం నీరందడంలేదు. కాలువలు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదు. హరిసాగరం, జగన్నాథసాగరం, వరహాలగెడ్డలను రిజర్వాయర్లగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంలేదు. మందస మండలంలో కళింగదళ్, డబారు, జంతి బంద రిజర్వాయర్లు మరమ్మతులు లేక ఖరీఫ్ ఆఖరులోనే ఆయకట్టుకు నీరందడం లేదు. మూడు మండలాల్లో సాగునీటి సమస్యలపై జగన్ ప్రభుత్వం చోద్యంచూస్తోందని రైతు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

## వంతెనల నిర్మాణమెప్పుడో?

పలాస మండలంలో ప్రధానంగా రోడ్డుకమ్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. వరహాల గెడ్డ నుంచి బ్రాహ్మణతర్లా పంచాయతీతోపాటు మరో ఐదు పంచాయతీలు వెళ్లాల్సి ఉంది. కేవలం రోడ్డు తప్ప బ్రిడ్జి లేకపోవడంతో ఏటా వర్షాకాలం రోడ్డుపై నుంచి నీరు పొంగి ప్రవహిస్తుండడంతో గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. గతంలో తుఫాన్‌వల్ల ఐదురోజులపాటు నీరు రోడ్డుపై నుంచి వెళ్లడంతో ఆ ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో జిల్లా రెస్క్యూటీమ్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం విదితమే.

- వరహాల గెడ్డపై కంబిరిగాం రోడ్డు మార్గంలో మరో ఐదు పంచాయతీలతో పాటు 35 గ్రామాలు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ రోడ్డుపై సుమారు నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం కోసం స్వతంత్రం వచ్చిన తర్వాత నుంచి ఎన్నికల హామీగా మిగిలింది.
- లొద్దభద్ర గ్రామానికి ఆనుకొని ఉన్న హరిసాగరం చెరువు పరిధిలో 500 ఎకరాల ఆయకట్టు ఉండగా, రిజర్వాయర్‌గా మార్చాలని పదేళ్ల నుంచి స్థానికులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. రిజర్వాయర్‌గా అభివృద్ధిచేస్తే 1000 ఎకరాలకు పైగా నీరందించడమే కాకుండా తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని రైతులు చెబుతున్నారు.
- లొత్తూరు వద్ద వరహాలగెడ్డపై రూ. కోటితో పనులు చేపట్టినా నిర్వహణ లోపంతో నీటి నిల్వకు అవకాశం లేకుండాపోయింది. నీరు వృథాగా పోతుండడంతో ఈ గెడ్డ వేసవిలో ఎండిపోతుంది. రూ.20కోట్లు వెచ్చిస్తే రిజర్వాయర్‌గా మారే అవకాశముందని నిపుణులు చెబుతున్నా ప్రభుత్వం ఉదాసీన వైఖరే అవలంబిస్తోంది. రైతులు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. దీని పరిధిలో ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుంది.
- పలాస, మందస మండలాల్లోని గిరిజన గ్రామాలకు రహదారులు, మంచి నీటి సౌకర్యం వేధిస్తున్నాయి. వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక వారధి, మంచినీళ్లపేట, నువ్వలరేవును కలిపే బ్రిడ్జి పూర్తయినా ఇంకా రహదారి సౌకర్యం కల్పించలేదు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



వరహాలగెడ్డ రిజర్వాయర్ నుంచి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

# ప్రచారంలో గీత దాటితే..




(నరసన్నపేట/గార)

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందర్భంలో పార్టీలూ, కార్యకర్తలూ నిబంధనలు మరిచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారానికి స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ..

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యా సంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా ఖచ్చితంగా ఉండాలి.
- ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్లలోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాల యాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటల్లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగలబెట్టకూడదు.

# హలో.. ఓటేసేందుకు రండి!

- వలస ఓటర్లపై పార్టీల దృష్టి
- ఫోన్ చేసి రప్పించేందుకు సన్నాహాలు
- స్థానిక నేతలతో సమాచారం



**నందిగాం:** సార్వత్రిక ఎన్నికల సమరం ఊపందుకుంటోంది. పోలింగ్‌కు ఇంకా రెండు వారాలు సమయం మాత్రమే ఉండడంతో క్రమేణా గ్రామాలు రాజకీయవాతావరణంతో వేడెక్కుతున్నాయి. గెలుపునకు అధికార, ప్రతిపక్ష పార్టీల గ్రామస్థాయి నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాగైనా గెలవాలని భావించి ప్రతి ఓటును కీలకంగా తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా ఉపాధి లేక వలస బాట పట్టిన ఓటర్లపై పార్టీలు దృష్టిసారించాయి. దీంతో గ్రామ స్థాయిలో నాయకుల నుంచి వలస ఓటర్ల సమాచారాన్ని సేకరించి ఎన్నికల పోలింగ్ నాటికి స్వగ్రామాలకు రప్పించేందుకు సన్నాహాలు అప్పుడే ప్రారంభించారు. శాసనసభతో పాటు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ప్రధాన పార్టీలు తమ అనుకూల ఓటర్ల వివరాలను స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు ద్వారా తెలుసుకొని ఫోన్‌లో వారితో మాట్లాడుతూ పోలింగ్‌కు రావాలని కోరుతున్నారు. అనేక గ్రామాల్లో వందల సంఖ్యలో ఉపాధి కోసం నగరపట్టణ ప్రాంతాలకు జిల్లా నుంచి వలస వెళ్లారు. పోలింగ్ నాటికి వస్తారో, రారో అన్న అనుమానంతో ముందస్తుగా వారికోసం ఆరాతీస్తున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడమే కాకుండా అది మనకు అనుకూలం అవుతుందన్న ఆశతో అభ్యర్థుల సూచనలతో అప్పుడే వలస ఓటర్లతో సంభాషణలు చేస్తూ వారు వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



# ఓటేయడానికి గుర్తింపు కార్డులివే

(సంతబొమ్మాళి)

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ తమతో బాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డును తీసుకెళ్తే కుదరదు. ఓటరు తమతో పాటు ఎటువంటి గుర్తింపు కార్డును తీసుకుని వెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 13 రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు.

- ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ)
- పాస్‌పోర్టు
- డ్రైవింగ్ లైసెన్సు
- సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి)
- పాస్‌బుక్ ( ఫొటోతో పాటు బ్యాంకు/పోస్టాఫీస్‌లో జారీ చేసినవి)
- పాన్ కార్డు, ఆధార్ కార్డు
- స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఎంఎన్ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డు
- ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఫొటో పింఛన్ పత్రం
- అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు/ఎమ్మెల్యేలు/ ఎమ్మెల్సీలకు జారీ చేసినవి)
- ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు
- ఆధార్ కార్డు



# పింఛన్ సొమ్ముతోనే జీవనం

- ఎన్నికల్లో పోటీచేసి ఆస్తుల కోల్పోయిన భర్త
- సామాన్య జీవితం గడుపుతున్న మాజీ ఎమ్మెల్యే నిచ్చెర్ల రాములు సతీమణి

ఆదర్శం



శిథిలావస్థలో నిచ్చెర్ల రాములు ఇల్లు



మాజీ ఎమ్మెల్యే నిచ్చెర్ల రాములు (ఫైల్)



రాములు భార్య వెంకటేశ్వరమ్మ

**పలాస:** సాధారణంగా రాజకీయ నాయకుల కుటుంబం అంటే కాస్త హంగు, ఆర్భాటాలు కనిపిస్తాయి. చుట్టూ మంది మార్బలం, ఫార్చునీర్ కార్లు, పెద్ద బంగ్లా, నిత్యం కాపలాదారులు ఉంటారు. ప్రసుతం రాజకీయ నాయకులు సామాన్య సర్పంచ్‌గా ఎన్నికైతే చాలు ఇవన్నీ సమకూర్చుకుని అధికారదర్పం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నిచ్చెర్ల రాములు కుటుంబం మాత్రం ప్రస్తుతం పలాసలో సాదాసీదా జీవనం గడుపుతోంది. హుందాగా జీవించాల్సిన నిచ్చెర్ల రాములు సతీమణి వెంకటేశ్వరమ్మ ప్రస్తుతం అతి సామాన్య జీవనం గడుపుతూ రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిస్తున్నారు.

## రెండుసార్లు ఎమ్మెల్యేగా..

రాములు స్వాతంత్రం వచ్చిన తర్వాత జరిగిన రెండో అసెంబ్లీ ఎన్నికల్లో బ్రాహ్మణతర్లా నియోజకవర్గం నుంచి 1955లో కృషికర్‌లోక్ పార్టీ తరపున, రెండోసారి 1967 ఎన్నికల్లో టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత రాజకీయాలను విరమించుకుని సామాన్య జీవితం గడిపారు. పలాస కాపువీధిలో నివాస ముంటున్న నిచ్చెర్ల రాములు తండ్రి మంగన్న పొగాకు వ్యాపారం చేసి ఆస్తులు సంపాదించగా రాములు మాత్రం రాజకీయాల్లో తన ఆస్తులు పోగొట్టుకున్నారు. రెండు ఎన్నికల్లో కూడా ఎవర్ని చేయి చాచకుండా సొంత ఖర్చుతోనే శాసనసభకు ఎన్నికయ్యారు. దీంతో ఉన్న ఆస్తులు కరిగిపోగా పలాసలో ఇళ్లు, కొద్దిపాటి స్థలం మిగిలింది. ఇది కూడా రాములు తండ్రి సంపాదించినవేనని ఆయన కుమారులు చెబుతారు. ఉత్తరాంధ్ర జిల్లాలో తెలగ సామాజిక కులం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన వ్యక్తిగా రాములు గుర్తింపు పొందారు. ఆయన హయాం లోనే పలాస ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు, పలాస మండల కార్యాలయం నిర్మించారు.కాగా 2003లో మృతిచెందారు. ఆయనకు భార్య వెంకటేశ్వరమ్మ, నలుగురు కుమా రులు ఉన్నారు. వీరు ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా, బ్యాంక్ మేనేజర్‌గా, జ్యుడీషియల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

## ధనమంతా ధారపోశారు..

రాములు భార్య వెంకటేశ్వరమ్మ తన కుమారుడి వద్దే ప్రస్తుతం ఉంటున్నారు. 90 ఏళ్లు కావడంతో వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాళ్లు వాచిపోయి తిరగ లేని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే భార్యలకు ఇచ్చే ప్రభుత్వ పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నారు. మందులు, దయనందిన ఖర్చులకు అవి సరిపోతాయని ఆమె చెబుతున్నారు. తన భర్త పదవీకాలంలో ఏమీ సంపాదించలేదని, ప్రజల కోసం ధనానంతా ధారపోశారని తెలిపారు. ప్రభుత్వం పింఛన్ తప్పా మరే ఇతర సౌకర్యాలు కల్పించలేదని, నివాసం, వైద్యఖర్చు, రేషన్ కార్డు సైతం ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు.

# సూపర్‌సిక్స్ పథకాలతో అభివృద్ధి: గోవిందరావు

**యంబరాం(ఎల్.ఎన్.పేట):** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం సాధ్యమని ఉమ్మడి పార్టీ అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం యంబరాం, బొడ్డవలస తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో తనకు సైకిల్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.నారాయణరావు, గోవిందరావు పాల్గొన్నారు. ● **కొత్తూరు:** రానున్న ఎన్నికల్లో కూటమిదే విజయమని పాతపట్నం కూటమి టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. పొన్నుటూరు గ్రామంలో సర్పంచ్ ఎద్దు చామంతితో వార్డు మెంబర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గోవిందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను మళ్లించి నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్, ఎద్దు సంతోష్, అగతముడి మాధవరావు, మాతల గాంధీ, చీకటి వీర్రాజు, దాసునాయుడు, పైల బాబ్జీ, తాతబాబు తదితరులున్నారు. కలిగాం సర్పంచ్ సనపల కోటేశ్వరరావుతో పాటు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి గోవిందరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


కొత్తూరు: పొన్నుటూరులో టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో గోవిందరావు

# కూటమి ప్రభుత్వంతో మేలు: రవికుమార్


బూర్జ: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రవికుమార్

**బూర్జ:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ఆమదాలవలస కూటమి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. అల్లెన, తుడ్డలి, లక్కుపురం, పాలవలస, రామన్నపేటల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. సీఎం జగన్ చేతకాని పాలనలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, కూటమి నాయకులు మొదలవలస రమేష్, ఆనెపు రామకృష్ణంనాయుడు, అంపిలి గణపతిరావు, వి.రాంజీ, కృష్ణ, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● **పొందూరు:** మండలంలో ధర్మపురం, వీఆర్‌గూడెం గ్రామాల నుంచి 70 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఏఎంసీ మాజీ ఛైర్మన్ అన్నెపు రాము, సువ్వారి మధు ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ కండువా కప్పి ఆహ్వానించారు. ధర్మపురం నుంచి 40, వీఆర్ గూడెం నుంచి 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నేతలు బలగ శంకరభాస్కర్, బి.గిరి, వి.మురళి తదితరులు ఉన్నారు. ● **ఆమదాలవలస:** అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు మెట్ట సుజాత అన్నారు. ఆదివారం నిమ్మ తొర్లాడ, పాతూరు, సిరింపేట, వెదుళ్లవలస, గొల్లపేట, నెల్లిపర్తి గ్రామాల్లో ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఆమదాలవలస ఎమ్మెల్యేగా కూన రవికుమార్‌ను, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, సనపల డిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

# కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి: ఎన్ఈఆర్

**జి.సిగడాం:** రాష్ట్రంలో కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం దవళపేట, సంతవురిటి, పాలఖండ్యాం, టీడీవలస, నక్కపేట, గెడెలపేట, సీతంపేట, మెట్టవలస, గొబ్బూరు. వెంకయ్యపేట, జగన్నాథవలస, వాండ్రంగి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాండ్రంగిలో వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, ఉపసర్పంచ్ డబ్బాడ రామారావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సుమారు 300 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని, ఎమ్మెల్యేగా తనకు కమలం, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కూటమి నేతలు కుమరాపు రవిమార్, వజ్జపర్తి రఘురాం, మీసాల రవికుమార్, గుణాకరరావు, ఎండమూరి శ్రీనివాసరావు, టి.మౌళీశ్వరరావు, బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం, కుదిరెళ్ల బుజ్జి, బూపతి అర్జున్ కుమార్, కంచరాన సూరన్నాయుడు, బి.వెంకటేశ్వరారవు, మహేదాశ్యం చిన్నారావు, బెవర బాలానందం పాల్గొన్నారు. ● **రణస్థలం:** కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నడుకుదిటి ఈశ్వరరావు, కలిశెట్టి అప్పల నాయుడులను గెలిపించాలని కోరుతూ ఎన్ఈఆర్ సతీమణి నడుకుదిటి రజని ఎచ్చెర్ల మండలం కొంగరాం, చినకొంగరాం తదితర గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొంగరాం మాజీ సర్పంచ్ నక్క లక్ష్మణరావు, గోపిన కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


జి.సిగడాం: ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎన్ఈఆర్

# టీడీపీపై నమ్మకంతో చేరికలు: బగ్గు

**నరసన్నపేట:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎం కావడం ద్వారా రాష్ట్ర పరిస్థితి బాగుంటుందని ప్రజలు, నాయకులు నమ్మడంతోనే పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలో దేశవానిపేటకు చెందిన పట్ట కర్రెన్న, లక్ష్మణ, శ్యామలరావు, రమణ, గోవింద,నాగరాజు తదితరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. పట్టణంలో ప్రచారం చేశారు. నేతలు గొద్దు చిట్టి బాబు, కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు, రోణంకి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న బగ్గు

## సారవకోట ఎంపీపీ చిన్నాల టీడీపీలో చేరిక

**జలుమూరు (సారవకోట):** వైసీపీ సీనియర్ నాయుడు, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడుతో పాటు 9 మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చిన్నాల చేరికతో టీడీపీ మరింత బలోపేతమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్రనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో వైసీపీని తరమికొట్టాలి: ఎంపీ

**సుసరాం(పోలాకి):** రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మో హన్ నాయుడు కోరారు. శనివారం సుసరాంలో మాజీ ఎంపీపీ తమ్మినాన శారదా భూషణ్ ఆధ్వర్యంలో సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే కృష్ణదాస్, కుటుంబ సభ్యులు అధికారాన్ని సొంత పనులకు, ధనార్జనకు వినియోగించుకున్నారని విమర్శించారు. తన ఎంపీ నిధులతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వేయడంతో పాటు రోడ్లు, నీటి వనరుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. కార్యక్రమంలో పంగ బావాజీ నాయుడు, మెండ శాంతా రాంబాబు, ఎంపీటీసీ యాగాటి లక్ష్మణ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ డోల జగన్, తమ్మినాన భూషణరావు, ఎంపీటీసీ శారద, కృష్ణమోహన్, సంపతిరావు రామన్న తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: గొండు శంకర్

**అరసవల్లి:** నగరంలోని హడ్కో కాలనీలోని మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ఆదివారం 6వ డివిజన్ హడ్కో కాలనీలో డివిజన్ ఇన్‌చార్జి కేవీఎస్ నాయుడు, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రజాగళం నిర్వమించి సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వివరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పేరుకే నగరమైన సమస్యల నిలయంగా మారిందని, శివారు కాలనీల కన్నా నగరం నడిబొడ్డున పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, జనసేన ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, డివిజన్ నాయకులు పేడాడ రమణమూర్తి, రౌతు సంతోష్, రొక్కం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **గార:** కూటమి అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరుతూ శంకర్ సతీమణి గొండు స్వాతి ఆదివారం అంబటివానిపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కూట మి నాయకులు అంబటి చక్రధరరావు, సాదు శ్రీరామ్, కుంచాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జవాన్ డిక్లరేషన్ ఆవిష్కరణ

**అరసవల్లి:** మాజీ సైనికుల సంక్షేమం కోసం జవాన్ డిక్లరేషన్‌ను ఆదివారం తన కార్యాలయంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాజీ సైనికోద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, అమరులైన, దివ్యాంగులైన వారి కుటుంబాలకు ప్రత్యేక కార్పస్ నిధి తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.


ప్రచారంలో ఇస్త్రీ చేస్తున్న గొండు శంకర్

## జగన్ మేనిఫెస్టో ఓ మాయ: అచ్చెన్నాయుడు

**టెక్కలి:** సీఎం జగన్ ప్రకటించిన వైసీపీ మేనిఫెస్టో ఓ మాయ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం టెక్కలి మండలం నర్సింగ పల్లి, కొల్లివలస, ముఖలింగాపురం, డమర, జగన్నాథపురం, పాలసింగి తదితర గ్రా మాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామన్నారు. చివరికి ఈ మేనిఫెస్టోలో వైసీపీ ఆ ఊసెత్తలేదన్నారు. వైసీపీ మేనిఫెస్టోను జనం నమ్మరని, ఆ పార్టీ ఓటమిని అంగీకరించినట్లే అర్థమవుతుందన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో వైసీపీలో వణుకు పుడుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో పిట్టలసరియా గ్రామం 20 కుటుంబాలు, నందిగాం మండలం నర్సిపురం పంచాయతీ కోమ టూరు నుంచి పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నేతలు బగాది శేష గిరి, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతిరావు తదిత రులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న అచ్చెన్నాయుడు

## టీడీపీతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి: అశోక్

**ఇచ్ఛాపురం/కంచిలి:** టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే బెందా ళం అశోక్ అన్నారు. ఆదివారం ఈదుపురం, శ్రీరాంపురం, శాసనాం గ్రామాల్లో కూటమితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజలను దోచుకుంటున్న వైసీపీ ప్రభు త్వాన్ని ఇంటికి పంపి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు మాదిని రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

## బూటకపు ఎన్‌కౌంటర్లను మానుకోవాలి

**పలాసరూరల్:** బూటకపు ఎన్‌కౌంటర్లను మానుకోవాలని, ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలని ప్రజా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరంలో ఆదివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల ఛత్తీస్‌ఘడ్ కంకేరి సరిహద్దులో జరిగిన మావోయిస్టు ఎన్‌కౌంటర్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. పాలకులు అమాయకులైన గిరిజనులపై దాడులు చేస్తున్నారని, దీనిని అందరూ ఖండించా లన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు పత్రి దానేసు, పోతనపల్లి కుసుమ, దున్న గోవిందరావు, ఎం.రామారావు, పిండి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## ఆదిత్యుని ఆదాయం రూ.2.69 లక్షలు

**అరసవల్లి:** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామికి ఆదివారం ఒక్కరోజు రూ.3,69,397 ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,37,800, విరాళాల ద్వారా రూ.53,807, ప్రసాదాల ద్వారా రూ.1,77,790 ఆదాయం వచ్చిందన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

**ఇచ్ఛాపురం:** సార్వత్రిక ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు కేకే శరవణ కుమార్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అభ్యర్థుల వ్యయాలు, ఖర్చుల రికార్డులను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. దిన పత్రికల్లో వచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌పై రివ్యూ జరిపారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర, ఎన్నికల డీటీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## అబాకస్ పోటీల్లో జ్యోతి ప్రకాష్ ప్రతిభ

**నరసన్నపేట:** జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో గీతాంజలి పాఠశాల విద్యార్థి పొట్నూరు జ్యోతి ప్రకాష్ 2వ స్థానం సంపాదించాడని ప్రిన్సి పాల్ కె.కోటిబాబు తెలిపారు. ఆదివారం హైదరా బాద్‌లో జరిగిన పోటీల్లో ఐదోతరగతి చదవుచున్న జ్యోతి ప్రకాష్ పాల్గొని ప్రతిభ కనబరి చాడన్నారు. ఈ మేరకు పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు డి.సత్యనారాయణ, ఎ.మల్లికార్జున శాస్త్రి విద్యార్థిని అభినందించారు.



ప్రతిభ కనపరిచిన జ్యోతి ప్రకాష్

## రంగస్థల నటి రాజేశ్వరికి కందుకూరి విశిష్ట పురస్కారం

**శ్రీకాకుళం కల్చరల్:** నగరానికి చెందిన రంగస్థల కళాకారిణి కేతిరెడ్డి రాజేశ్వరికి కాకినాడకు చెందిన కందుకూరి విశిష్ట రంగస్థలం పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం కాకి నాడ సీతారామరాజు స్మారక కళా వేదికపై నట ప్రజ్ఞ అవార్డును సంస్థ అధ్యక్షుడు పంపన దయానంద బాబు, కర్రి బామిరెడ్డి అందించి అభినందించారు. ఈ సందర్భంగా రాజేశ్వరిని రంగస్థల కళాకారుల సమా ఖ్య గౌరవాధ్యక్షులు ఎల్.రామలింగ స్వామి, చిట్టి వెంకటరావు తదితరులు అభినందించారు.


రంగస్థల నటి రాజేశ్వరిని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

## 22 ద్విచక్ర వాహనాలు సీజ్

**సరుబుజ్జిలి:** సరుబుజ్జిలి, ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించి ధ్రువపత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామంలో 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ నిహార్ తెలిపారు. ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎటువంటి పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

## 110 లీటర్ల సారా స్వాధీనం

**మెళియాపుట్టి:** మండలంలోని ముడిఖిండిభద్ర గ్రామంలో ఆదివారం దాడులు చేసి 110 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సారా అమ్మకంగాని, తయారీ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో పాతపట్నం సీఐ నల్లి సాయి, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

## 50 మద్యం బాటిళ్లు పట్టివేత

**ఇచ్ఛాపురం:** ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న అరకభద్రకు చెందిన ఓ మహిళ నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఇచ్ఛా పురం మొబైల్ పెంట్రోలింగ్ పార్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేంద్రకుమార్ తెలిపారు. గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించగా జీడి తోటలో ఓ మహిళ మద్యం బాటిళ్లతో పట్టుబడిందన్నారు. ఒడిశా పాత్రపురం వైన్స్ షాపు నుంచి కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి, కూర్మనాయకులు, ఎన్‌టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలతో పట్టుబడిన సేల్స్‌మన్

**సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న గున్న గోవిందరావు 17 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్రవాహనంపై గోవిందరావు వెళుతుండగా తనిఖీ చేయగా మద్యం సీసాలు లభ్యమయ్యాయని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**సోంపేట:** కొర్లాం జాతీయ రహదారిపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కొర్లాం వద్ద ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సమయంలో బరంపురం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సును కానిస్టేబుల్ సత్తిరాజు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.లక్ష విలువ చేసే 19 ప్యాకెట్లలో ఉన్న 21 కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితుడు బస్సు దిగి పారిపోగా పోలీసులు వెంబడించి అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

# ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి: శిరీష

**పలాస:** జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా పలాసను తీర్చిదిద్దుకుందామని, తనను దీవించి ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ నాయకులతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికే ఒక విజయమని, ఉమ్మడి అజెండాతో ప్రజల ముందుకు వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు వజ్జ బాబూ రావు, డాక్టర్ దానేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, పి.వైకుంఠ రావు, ఏహెచ్‌కే శ్రీకాంత్, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబు చౌదరి సంతోష్ పండా, అట్టాడ వాసు, కూన కృష్ణారావు, వంశీ, దుర్గారావు పాల్గొన్నారు. **హరిపురం:** మందస మండలం సరియా పల్లి, సువర్ణాపురం గ్రామాల్లో ఆదివారం టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, సర్పంచ్ కరగాన వాసు, సాలిన భీమారావు, నోరియా హరి, దశరథ, రాముడు, రట్టి లింగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

## ఒకటో తేదీనే పెన్షన్లు చెల్లించాలి


కోటబొమ్మాళిలో టీడీపీ నాయకుల నిరసన

**టెక్కలి:** సామాజిక భద్రతా పెన్షన్లు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోటబొమ్మాళిలో టీడీపీ నాయకులు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీలో కావాలనే నిర్లక్ష్యం చేస్తూ పింఛన్‌దారులకు ఇబ్బందులు కలిగిస్తూ దీనిని ఎదుటి వారిపై తోసేస్తున్నారని టీడీపీ నాయకులు కింజరాపు వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్, వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చీకటిపేటలో పోలీస్ పికెట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**రణస్థలం:** ఎన్నికల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రామచంద్రరావు హెచ్చరించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'మమ్మల్ని ఎవర్రా ఎదిరించేది' శీర్షికతో వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. ఆదివారం ఎన్‌జీఆర్ పురం పంచా యతీ చీకటి పేటలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి కవాతు నిర్వహిం చారు. స్థానికులతో మాట్లా డారు. ఈ పంచాయతీలో అధికార పార్టీ శ్రేణులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సానుభూతిపరులపై దాడులు చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులు స్పందించారు. ప్రజాస్వామ్యంలో అందరికీ అభిప్రాయాలుంటాయని, వాటిని కాలరాసేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గోవిందరావు స్పష్టం చేశారు. ప్రత్యర్థులపై దాడిచేసి హింసించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## 'వైసీపీతో అందరికీ అన్యాయం'

**కంచిలి:** రాష్ట్రంలో సీఎంగా జగన్ అయిన తరువాత దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని రాష్ట్ర సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కమిటీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గొల్ల వరప్రసాద్ అన్నారు. ఆదివారం కంచిలిలో సంస్థ సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఔట్‌సోరింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగు నియామకాల్లో రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని పాటించలేదని, గతంలో దళితులకు ఉన్న 27 సంక్షేమ పథకాలతో పాటు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య స్కాలర్ షిప్ పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు ఎక్కువగా జరిగాయన్నారు. సైనిక్‌దళ్ సభ్యులు లోకేష్, నాగేష్, రావణ్, మర్రిపాటి పూర్ణచంద్ర పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

**ఇచ్ఛాపురం:** పట్టణంలో దుకాణదారులు తమ వ్యాపారానికి చెందిన వస్తువులను రోడ్లపై పెడితే చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం ప్రధాన జంక్షన్‌లలో వాహనాల తనిఖీ చేపట్టారు. దుకాణాల సూచిక బోర్డులు, వస్తువులు రోడ్లపై పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఊరుకునేది లేదన్నారు. వాహనం నడిపే వారు తప్పకుండా ధ్రువపత్రాలతో పాటు లైసెన్సు ఉండాలని లేకుంటే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామన్నారు. అత్యధిక సౌండ్‌లు ఉండే బైక్ సైలెన్సర్లు వాడకూడదన్నారు.